# కరెంట్ అఫైర్స్

## జాతీయం

**1.** దేశంలోనే అత్యంత ఎత్తయిన ఎస్కలేటర్‌ను ఏ నగరంలోని జనక్‌పురి వెస్ట్ - కల్కాజి మందిర్ మెట్రో రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేశారు? (15.6 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ఎస్కలేటర్ 2.6 టన్నుల బరువుతో, అయిదు అంతస్థుల భవనం ఎత్తుకు సమానంగా ఉంటుంది.)

1) దిల్లీ 2) బెంగళూరు 3) కోల్‌కతా 4) చెన్నై

**2.** దేశంలోని సుమారు 1.5 లక్షల తపాలా కార్యాలయాల నెట్‌వర్క్‌ను ఆధునికీకరించిన సంస్థ ఏది?

(2013లో తపాలా శాఖతో కుదుర్చుకున్న రూ.1100 కోట్ల ఒప్పందంలో భాగంగా సంస్థ దీన్ని పూర్తిచేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద డిస్ట్రిబ్యూటెడ్ ఇ-పోస్టల్ నెట్‌వర్క్‌ని సంస్థ పేర్కొంది. గ్రామీణ డాక్ సేవకులు మారుమూల గ్రామాల నుంచే తపాలా, బ్యాంకింగ్, బీమా, నగదు నిర్వహణ సేవల్ని అందించేందుకు వీలుగా 'దర్పణ్' అనే పరికరాన్ని రూపొందించినట్లు వెల్లడించింది. ఎలాంటి నెట్‌వర్క్ కనెక్టివిటీ లేకపోయినా ఈ పరికరం ద్వారా వారు సేవలు అందించవచ్చు)

1) హెచ్‌సీఎల్ 2) ఇన్ఫోసిస్ 3) విప్రో 4) టీసీఎస్

**3.** కింది అంశాల్లో సరైంది?

1) నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్)ల నుంచి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిష్క్రమించింది.

2) వాటిలో ఉన్న మొత్తం వాటాలను వరుసగా రూ.1450 కోట్లు, రూ.20 కోట్లకు ప్రభుత్వానికి విక్రయించింది. దీంతో అవి పూర్తిస్థాయి ప్రభుత్వ యాజమాన్య సంస్థలుగా మారాయి.

3) 2001 అక్టోబరులో నరసింహం కమిటీ ఇచ్చిన నివేదికతో పాటు, ఆర్‌బీఐ సొంత చర్చా పత్రమైన 'హార్మనైజింగ్ ది రోల్ అండ్ ఆపరేషన్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ బ్యాంక్స్' సిఫారసుల అమల్లో భాగంగానే ఈ పరిణామం చోటు చేసుకుంది.

4) పైవన్నీ

**4.** నిర్భయనిధి కింద మహిళల భద్రతకు సంబంధించి హైదరాబాద్ సహా 8 నగరాల్లో 'సురక్షిత్ నగర్ (సేఫ్ సిటీ)' ప్రాజెక్టుల కోసం కేంద్రం ఎంత మొత్తం మంజూరు చేసింది? (హైదరాబాద్, దిల్లీ, కోల్‌కతా, ముంబయి, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, లఖ్‌నవూ నగరాల్లో 'సేఫ్ సిటీ' ప్రాజెక్టులు అమలు చేస్తారు. బహిరంగ ప్రాంతాల్లో మహిళలకు భద్రత కల్పించేందుకు ఈ నిధులు వెచ్చిస్తారు.)

1) రూ.2,319.55 కోట్లు 2) రూ.2,719.55 కోట్లు

3) రూ.2,519.55 కోట్లు 4) రూ.2,919.55 కోట్లు

**జవాబులు:** 1-1, 2-4, 3-4, 4-4.

## అంతర్జాతీయం

**1.** కింది అంశాల్లో సరైనవి?

ఎ) విశ్వంలో అత్యంత పురాతన అణువును శాస్త్రవేత్తలు మొదటిసారిగా కనుక్కున్నారు. హీలియం హైడ్రైడ్ అయాన్ ($HeH^+$) అనే ఈ అణువు 1400 కోట్ల ఏళ్ల కిందట ఏర్పడిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

బి) విశ్వం పుట్టుకకు కారణమైన 'బిగ్‌బ్యాంగ్'లో జనించిన తేలికపాటి మూలకాల పునఃమిశ్రమానికి నాటి ప్రత్యేక ఉష్ణోగ్రతలు దోహదపడ్డాయి. నాడు అయనైజ్డ్ హైడ్రోజన్, న్యూట్రల్ హీలియం పరమాణువులు చర్య జరిపి $HeH^+$ను ఏర్పరిచాయి.

సి) తొలినాటి విశ్వంలో ఈ అణువుకు ఎంతో ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఆచూకీ దొరకలేదు. ఎత్తయిన ప్రదేశంలో సంచరిస్తూ విశ్వాన్ని పరిశీలించే సోఫియా (ది స్ట్రాటో స్ఫియరిక్ అబ్జర్వేటరీ ఫర్ ఇన్‌ఫ్రారెడ్ ఆస్ట్రానమీ) అబ్జర్వేటరీలోని గ్రేట్ ఫార్ - ఇన్‌ఫ్రారెడ్ స్పెక్ట్రోమీటర్ తాజాగా $HeH^{+}$ అణువును ఎన్‌జీసీ 7027 అనే గ్రహ నెబ్యులాలో గుర్తించింది.

డి) ఈ విషయాలను మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రేడియో ఆస్ట్రానమీ (జర్మనీ) శాస్త్రజ్ఞులు 'నేచర్' జర్నల్ తాజా సంచిక (ఏప్రిల్ 17)లో వెల్లడించారు.

1) ఎ 2) ఎ, బి 3) ఎ, బి, సి 4) అన్నీ

**2.** ప్రపంచంలోనే అత్యంత తక్కువ బరువుతో జన్మించిన మగబిడ్డగా రికార్డులకెక్కిన ర్యుసుకె సెకియా 2018 అక్టోబరు 1న ఏ దేశంలో జన్మించాడు? (తల్లి అధిక రక్తపోటుతో బాధపడుతుండటంతో 24 వారాల 5 రోజులకే అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్స ద్వారా కాన్పు చేశారు. 258 గ్రాముల బరువుతో ర్యుసుకె జన్మించాడు. తక్కువ బరువు ఉండటంతో నియోనేటర్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి సంరక్షించారు. 2019 ఏప్రిల్ 19 నాటికి బిడ్డ 3 కిలోల బరువుకు చేరడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.)

1) దక్షిణ కొరియా 2) జపాన్ 3) సింగపూర్ 4) చైనా

**3.** ఏ దేశంలో మొదటిసారిగా హిందూ సంప్రదాయ విధానంలో నిర్మిస్తున్న స్వామినారాయణ్ ఆలయానికి 2019 ఏప్రిల్ 20న శంకుస్థాపన చేశారు? (గుజరాత్‌కు చెందిన బొచాసన్‌వాసి శ్రీ అక్షర పురుషోత్తం స్వామి నారాయణ సంస్థ - బీఏపీఎస్ అధిపతి మహంత్ స్వామి మహరాజ్, ఆ దేశంలో భారత రాయబారి నవ్‌దీప్ సూరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2015లో ప్రధాని మోదీ తొలి పర్యటన సందర్భంగా ఆలయ నిర్మాణ ప్రణాళికకు ఈ దేశ ప్రభుత్వం ఆమోదం తెలిపింది.)

1) యూఏఈ 2) సౌదీ అరేబియా 3) ఖతార్ 4) బహ్రెయిన్

**జవాబులు:** 1-4, 2-2, 3-1.

## రాష్ట్రీయం

**1.** తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా పేరొందిన సలేశ్వరం యాత్ర రాష్ట్రంలోని ఏ జిల్లాలో జరిగింది?

1) నల్గొండ 2) జోగులాంబ గద్వాల 3) నాగర్ కర్నూలు 4) మహబూబ్‌నగర్

**2.** తెలంగాణ హైకోర్టు శతాబ్ది ఉత్సవాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? (ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైకోర్టు భవన నిర్మాణాన్ని 1915 ఏప్రిల్ 15న ప్రారంభించారు. జైపూర్‌కు చెందిన ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ శంకర్‌లాల్ దీన్ని రూపొందించారు. ఇంజినీర్ మెహర్‌అలీ ఫజల్ పనుల్ని పర్యవేక్షించారు. మూసీనది ఒడ్డున గులాబీ, బూడిదరంగు గ్రానైట్ రాళ్లతో ఇండో ఇస్లామిక్ శైలిలో దీన్ని నిర్మించారు. 1919 మార్చి 31న నిర్మాణం పూర్తయింది. 1920 ఏప్రిల్ 20న ఏడో నిజాం ఈ హైకోర్టును ప్రారంభించారు.)

1) 2019 మార్చి 31 2) 2019 ఏప్రిల్ 1 3) 2019 ఏప్రిల్ 15 4) 2019 ఏప్రిల్ 20

**3.** ఆంధ్రప్రదేశ్‌లోని ఏ దేవస్థానానికి అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ ఐఎస్‌వో గుర్తింపు లభించింది?

1) అమరావతి 2) అన్నవరం 3) సింహాచలం 4) విజయవాడ

**4.** అమరావతి జమీందార్ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు 259వ జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఏ రోజున నిర్వహించింది?

1) 2019 ఏప్రిల్ 23 2) 2019 ఏప్రిల్ 25 3) 2019 ఏప్రిల్ 27 4) 2019 ఏప్రిల్ 29

**5.** పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ తాత్కాలికంగా స్థిర నివాసం ఏర్పరచుకున్న వారికి పోషకాహారం అందించేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది? (రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, పురపాలక పరిధిలో విస్తరించిన ప్రాంతాల్లో 706 చోట్ల ఎక్కువగా వలసవెళ్లినవారు నివసిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.)

1) ఆంధ్రప్రదేశ్ 2) మహారాష్ట్ర 3) తెలంగాణ 4) గుజరాత్

**జవాబులు:** 1-3, 2-4, 3-2, 4-3, 5-1.

## ఇతరాలు

**1.** కింది అంశాల్లో సరైనవి ఏవి?

ఎ) ప్రపంచంలోని ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో కూడిన బ్రిటన్ రాయల్ సొసైటీ 2019 సంవత్సరానికి మొత్తం 51 మంది ప్రముఖ శాస్త్రవేత్తలను 'రాయల్ సొసైటీ ఫెలో'లుగా ప్రకటించింది.

బి) బ్రిటన్ రాయల్ సొసైటీ ఫెలోగా ఎంపికైన భారత తొలి మహిళా శాస్త్రవేత్తగా ప్రొఫెసర్ గగన్‌దీప్ కాంగ్ రికార్డు సృష్టించారు. ఈమె ఫరీదాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (THSTI) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సి) ఈమెతోపాటు మరో నలుగురు భారత సంతతి శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ గురుదయాళ్ బెస్రా, ప్రొఫెసర్ మంజుల్ భార్గవ, ప్రొఫెసర్ అనంత్ పరేఖ్, ప్రొఫెసర్ అక్షయ్ వెంకటేష్‌లు రాయల్ సొసైటీ ఫెలోలుగా 2019లో ఎంపికయ్యారు.

డి) ప్రముఖ శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త, ఔషధ రంగ దిగ్గజ సంస్థ సిప్లా ఛైర్మన్ యూసుఫ్ హమీద్ (82) 2019కి బ్రిటన్ రాయల్ సొసైటీ గౌరవ ఫెలో (హానరరీ ఫెలో)గా ఎంపికయ్యారు.

1) ఎ, బి 2) ఎ, బి, సి 3) ఎ, బి, డి 4) అన్నీ

**2.** పంజాబ్‌లోని లూథియానాలో నిర్వహించిన దేశవాళీ ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ టోర్నీ సంతోష్ ట్రోఫీని ఏ జట్టు నెగ్గింది? (ఈ జట్టు ఫైనల్లో 1-0తో పంజాబ్‌ను ఓడించి ఆరోసారి టైటిల్ చేజిక్కించుకుంది. ఇది 73వ సంతోష్ ట్రోఫీ).

1) పశ్చిమ్ బంగా 2) సర్వీసెస్ 3) కేరళ 4) మహారాష్ట్ర

**3.** ప్రాచీనమైన నాలుగుకాళ్ల తిమింగలానికి చెందిన శిలాజ అవశేషాలను శాస్త్రజ్ఞులు ఏ దేశంలోని తీర ఎడారి ప్రాంతం 'ప్లేయా మీడియా ల్యూనా'లో కనుక్కున్నారు?

1) చిలీ 2) అర్జెంటీనా 3) పెరూ 4) ఆస్ట్రేలియా

**4.** వోలోడిమైర్ జెలెన్‌స్కీ ఏ దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు? (తాజాగా జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు పెట్రో పోరోషెంకోకు 24.46 శాతం ఓట్లు మాత్రమే దక్కగా, నూతన అధ్యక్షుడికి 73.22 శాతం ఓట్లు వచ్చాయి. 'సర్వెంట్ ఆఫ్ ది పీపుల్' అనే కామెడీ టీవీ సీరియల్‌లో జెలెన్‌స్కీ ఈ దేశాధ్యక్షుడిగా నటించారు. ఈ సీరియల్ ముగిసిన నెల రోజుల్లోనే దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 41 ఏళ్ల జెలెన్‌స్కీ ఈ దేశం తరుపున అత్యంత పిన్న వయస్కుడైన అధ్యక్షుడు.)

1) ఉక్రెయిన్ 2) బెలారస్ 3) హంగేరీ 4) పోలెండ్

**జవాబులు:** 1-4, 2-2, 3-3, 4-1.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**